పన్నుల వసూలులో ముందంజ

- మండలంలో ఇప్పటివరకు 81 శాతం మేర పన్నుల వసూలు
- గడువులోపు టార్గెట్ చేరుకుంటామంటున్న అధికారులు



దండుమైలారం గ్రామ పంచాయతీ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: 2023–24 ఆర్థిక సంవత్సరం పన్నుల వసూలులో ఇబ్రహీంపట్నం మండలం ముందంజలో ఉంది. మండల పరిధిలో 14 గ్రామ పంచాయతీలున్నాయి. గృహ, వాణిజ్య, వ్యాపార, విద్య, వైద్య భవనాలకు పన్నుల రూపకంగా రూ.87లక్షల 87వేలు వసూలు చేయాల్సివుంది. ఫిబ్రవరి 28వ తేదీ వరకు రూ.69 లక్షల 44వేలకు పైగా వసూలు చేశారు. సుమారు 81 శాతం పన్నులు వసూలైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పన్నుల చెల్లింపులో 92 శాతం వసూలు చేసి కర్ణంగూడ గ్రామపంచాయతీ ముందు వరుసలో ఉండగా.. 70 శాతం వసూలు చేసి ఎల్మినేడు గ్రామ పంచాయతీ వెనుకబడి ఉంది. తుర్కగూడ 90 శాతం, ముకునూర్ 88 శాతం, ఉప్పరిగూడ 87 శాతం, నాగన్‌పల్లి గ్రామ పంచాయతీలో 85 శాతం పన్నులు వసూలయ్యాయి. మరో రూ18 లక్షలు వసూలు చేయాల్సివుంది. త్వరలో టార్గెట్ చేరుకుంటామని మున్సిపల్ అధికారులు తెలిపారు. పన్నుల చెల్లింపు విషయంలో ప్రజలు సహకరించాలన్నారు.

ప్రజలు సహకరించాలి



పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలి. ఇప్పటివరకు మండలంలో 81శాతం మేర పన్నులు వసూలయ్యాయి. వంద శాతం వసూలు చేసేందుకు కృషి చేస్తాం. పన్నులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతారు. పన్నులు చెల్లించనివారికి నోటీసులు పంపిచడంతో పాటు చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులకు.. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి.

– లక్పతినాయక్, ఎంపీఓ, ఇబ్రహీంపట్నం

క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ



కొత్తపల్లి గ్రామ కమిటీ సభ్యులతో నర్సింహ, నాయకులు

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యాచారం మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌కు బలమైన క్యాడర్ ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మల్‌రెడ్డి రంగారెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించడం కోసం సైనికుల్లాగా పనిచేయాలని కోరారు. అనంతరం కొత్తపల్లి గ్రామ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎండీ ఘని, ఉపాధ్యక్షుడిగా ఈగ లింగారెడ్డి, కార్యదర్శిగా కొండాపురం కృష్ణ, సహాయ కార్యదర్శిగా తలారి వెంకటయ్య, కోశాధికారిగా కంబాలపల్లి మంగయ్య, సలహాదారుడిగా బిల్లంపల్లి వెంకటయ్య, నాగిళ్ల వెంకటయ్యతో పాటు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాలెకుమార్, ఉపాధ్యక్షుడిగా తలారి మహేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల కార్యనిర్వాహణ అధికారి మోటె శ్రీశైలం పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



విలియమ్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దర్జీలు

కడ్తాల్: ఆమనగల్లు పట్టణంలో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టైలర్స్ డేని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుట్టు మిషన్ రూపకర్త విలియమ్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని సీనియర్ టైలర్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, నాయకులు పత్యానాయక్, పాపిశెట్టిరాము, కేశవులు, టైలర్స్ అసోసియేషన్ సభ్యులు సాయిబాబా, శ్రీను, నర్సోజీ, భిక్షపతి, సాయి, గంజి శ్రీను, సతీశ్, శివలింగం, యాదగరి, కృష్ణ, తరుణ్ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ప్రీతి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మెడికో ప్రీతికి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం కొంగరకలాన్‌లో ప్రగతినివేదన పాదయాత్రలో భాగంగా.. ప్రీతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రీతి కుంటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను కఠినతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కొంగరకలాన్‌లో బహుళజాతి సంస్థలు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్ పక్కనే మరో రెండు బహుళజాతి సంస్థల ఏర్పాటుకు కృషి చేస్తున్నానని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర సోమవారం రాత్రి ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో కొనసాగింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గడపగడపకు వెళ్లి వివరించారు. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన కాకి కుమార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. రాత్రి కొంగరలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కొంగరకలాన్‌కు తీసుకురావడానికి నేను చేసిన పోరాట ఫలితమే నేడు కొంగరకలాన్‌లో ఎకరం భూమి విలువ రూ.6 కోట్లు పలుకుతోందన్నారు. కలెక్టరేట్ పక్కన భవిష్యత్‌లో బహుళజాతి సంస్థలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పిస్తానని చెప్పారు. కొంగరలోకలెక్టరేట్‌తో నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లోభూముల ధరలకు రెక్కలొచ్చాయన్నారు. భవిష్యత్‌లో మరిన్న కంపెనీలు నెలకొల్పి స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఆదిబట్ల వైస్ చైర్‌పర్సన్ కళమ్మ, ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు మహేందర్, శ్రీనివాస్, నాగేష్, సంధ్య, మౌనిక, బీఆర్‌ఎస్‌మున్సిపల్ అధ్యక్షుడు జంగయ్య, మాజీ అధ్యక్షుడు బాబులు, ప్రధాన కార్యదర్శి నారయణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి



మేడిగడ్డతండాలో జోడో యాత్రలో వంశీచంద్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్: ప్రజల కష్టాలను, సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తథ్యమని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రలో భాగంగా మంగళవారం ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమానికి చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేడిగడ్డ గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కరపత్రాల ద్వారా వివరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే రైతులకు రూ.2 లక్షల పంట రుణాల మాఫీ, రూ.5 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం అమలు, రూ.500 కే వంటగ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను అమలు చేయనుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వాదించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రాములు, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కృష్ణనాయక్, శ్రీశైలం, రఘు, సురేశ్, రాజు, శ్రీకాంత్, కిషన్, హరిలాల్, ఫరీద్, మహేశ్, శ్రీశైలం, లక్ష్మణ్, కృష్ణయ్య, రాజేశ్, చంద్రు ఉన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వాలు..

తలకొండపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయని టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని పడకల్‌లో మార్చి 2న నిర్వహించనున్న హాత్‌సేహాత్ జోడో యాత్రకు ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరుకానున్నారని ఆయన చెప్పారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను విస్మరించాయన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు.. కృష్ణయ్య, ఆరీఫ్, తిరుపతి, ప్రవీణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి తండా బీటీ రోడ్డుకు నిధులు మంజూరు

యాచారం: యాచారం–మాడ్గుల్ మండలాల సరిహద్దు, అటవీ ప్రాంతంలో ఉన్న కొత్తపల్లి అనుబంధ గిరిజన తండావాసులకు రోడ్డు సమస్య తీరనుంది. కొత్తపల్లి–కొత్తపల్లి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రూ.2.38 కోట్ల నిధులు మంజూరు చేయించారు. నాలుగు రోజుల కిందటే ట్రైబల్ వెల్ఫేర్ కింద నిధులు మంజూరైనట్లు ప్రొసీడింగ్ వచ్చింది. మంజూరైన నిధుల ద్వారా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి త్వరలో రోడ్డు పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామానికి చెందిన పద్మకు రూ.27 వేలు, మద్దెలకుంట తండాకు చెందిన చంప్లీకి రూ.32 వేలు, రేఖ్యతండాకు చెందిన లస్కర్‌కు రూ.26 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరయ్యాయి. మంగళవారం అన్మాస్‌పల్లి గ్రామంలో బాధితులకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌లు శంకర్, లక్ష్మీనర్సింహారెడ్డి, సులోచన, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, నాయకులు సాయిలు, బాలకృష్ణ, సాయికుమార్ ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి

కడ్తాల్: చీడపీడల బారి నుంచి పంటలను రక్షించుకోవడానికి రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆమనగల్లు మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి, వేరుశనగా, ఆముదం, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వరి నాటే సమయంలో జింక్ సల్ఫేట్ ఎకరాకు 20 కేజీలు చల్లాలని సూచించారు. అదే విధంగా వరిలో కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్లయ్య, జంగయ్య, నారయ్య, జగన్ ఉన్నారు.

గొల్లకురుమలను ఆదుకోవాలి

సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

కడ్తాల్: గత కొంతకాలంగా గొర్రెల–మేకల మందపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని కడ్తాల్ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు క్యామ చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం నాయకులతో ఆయన సమావేశమయ్యారు. మండలంలో గొల్లకురుమ సోదరులు గొర్రెలను, మేకలను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. గొర్రెల మందపై కుక్కలదాడితో గొల్లకురుమలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కుక్కల బెడద నుంచి తీర్చాలంటూ తీర్మానం చేసి పంపించాలన్నారు. కుక్కల దాడిలో నష్టపోయిన గొల్ల కురుమలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కుక్కలను గ్రామ శివార్లలో లేదా జనసంచారం లేని ప్రదేశాల్లో వదలాన్నారు. సంఘంనాయకులు రాంచంద్రయ్య, రాములు, శ్రీను, యాదయ్యయాదవ్, రమేశ్, యాదయ్య, మహేశ్, శ్రీను, నరేశ్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన జోలం కృష్ణయ్య (59) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.6000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కృష్ణయ్య, బాలస్వామి, మచ్చెందర్, మైసయ్య, రాజు ,అశోక్, గురువయ్య, రాజెందర్, వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గట్టుఇప్పలపల్లికి చెందిన నరేందర్ ఇటీవల మృతిచెందాడు. జోలం కృష్ణయ్యతో పాటు, నరేందర్ కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆరస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజు మహేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.

ఆచారి సేవాదళం ఆధ్వర్యంలో..

కడ్తాల్: ఆమనగల్లు పట్టణంలోని 9వ వార్డుకు చెందిన వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆచారి సేవాదళం సభ్యులు మంగళవారం పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మహేశ్, ఆనంద్, శ్రీనివాస్, కిట్టు, వంశీ, సురేశ్, వెంకటయ్య, కరుణాకర్, మల్లేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మాడ్గుల: మాడ్గులకు చెందిన జింకల మైసయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి.. ఫౌండేషన్ తరపున మృతుడి కుటుంబానికి మంగళవారం రూ.5వేల ఆర్థికసాయాన్ని ఫౌండేషన్ సభ్యుడు జైపాల్‌రెడ్డి ద్వారా అందజేశారు.

సత్యమ్మ కుటుంబానికి..

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన సోమరాజు సత్యమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని మంగళవారం డీసీసీ అధికార ప్రతినిధి, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, కృష్ణయ్య, నర్సింహ, యాదయ్య, శ్రీను, రాజేశ్, విజయ్‌రాథోడ్, మహేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బీజేపీ కార్నర్ మీటింగ్‌లో నేతలు



యాచారం: సమావేశంలో మాట్లాడుతున్న కొప్పు బాషా

యాచారం: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల అక్రమాలు, అవనీతిపై విచారణ జరిపిస్తామని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ప్రజా గోస– బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులుఅక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఫార్మాసిటీకి సేకరిస్తున్న భూముల్లో భారీ కుంభకోణాలు జరిగాయని రైతులు ఫిర్యాదులు చేస్తున్నా అధికారుల్లో చలనం లేదని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, యాచారం గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లలిత, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు యాదయ్య, రమేష్, జంగయ్యగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు 15వ వార్డులో..

కడ్తాల్: పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్ అన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డులో వార్డు కౌన్సిలర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యాక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తుంటే గ్రామాల అభివృద్ధి తామే చేశామని బీఆర్‌ఎస్ పార్టీ గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హమీలను పూర్తిగా విస్మరించారని అన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి నర్సింహ, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బూత్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, నాయకులు ఉన్నారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు..

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో గ్రామాల్లో పనులు చేపడుతూ.. కేంద్రం నిధులు ఇవ్వడం లేదని సీఎం కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు మోహన్‌రెడ్డి, రమేష్, రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, యాదగిరి, సాయిలాల్ తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



మొక్కలు నాటుతున్న దశరథ్‌నాయక్, నాయకులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ గంప వెంకటేశ్ పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. మొక్కలతోనే మానవ మనుగడ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు జోగువీరయ్య, వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ గోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఇర్షాద్, నాయకులు బాలకృష్ణ, లక్పతినాయక్, శ్రీకాంత్, అంజి, కృష్ణ, జగదీశ్, సతీశ్, మహేశ్, కిషన్, రాజు, కల్యాన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



రాఘవేందర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ శివారు ప్రాంతంలోని కల్కిదోనగుట్ట గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రం అందించారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు మార్చి 6వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ క్రియాశీలక కార్యవర్గ సభ్యులు, పూజారి సిద్దాంతి కృష్ణమూర్తి శర్మ, ఆలయ ఈఓ మోహన్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ మోహన్‌రావు, అర్చకులు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి ఆదరణ

మాడ్గుల: మాడ్గుల మండలంలోని అవురుపల్లి గ్రామంలో మంగళవారం ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మూడురోజుల పాటు మాడ్గుల మండలంలోని గ్రామాల్లో ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల సూచించారు. ఈ కార్యక్రమంలో డా.ఉప్పల అఖిల్, సర్పంచ్ హనుమాన్ నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, ఉపసర్పంచ్ రాంచంద్రయ్య, హరిమోహన్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు చేపట్టాలి

- ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఘనంగా సైన్స్ డే
- సైన్స్ ఫెయిర్‌లలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



కడ్తాల్: సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు మంచి మార్కులతో పాటు విజ్ఞానవంతులుగా ఎదగాలని ఇబ్రహీంపటన్నం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని ఇబ్రహీంపటన్నంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను తిలకించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

కడ్తాల్: ఆమనగల్లు పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నేషనల్ సైన్స్‌డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు సైన్స్ పరికరాలతో వివిధ రకాల విజ్ఞాన ప్రదర్శనలు, ప్రయోగాలు ప్రదర్శించారు. పాఠశాల హెచ్‌ఎం పద్మ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులు ప్రేమకుమారి, విజయలక్ష్మి, దుర్గ, శ్వేత, జయశ్రీ,కుసుమ, అరుణసురేఖ, ఉమావతి, కరుణ, విద్యావతి తదితరులు ఉన్నారు.

కొహెడ ప్రభుత్వ పాఠశాలలో..

హయత్‌నగర్: తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని కొహెడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. గణిత, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించిన ప్రయోగాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు లక్ష్మణ్, పండయ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నందివనపర్తి ఉన్నత పాఠశాలలో..

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు చేపట్టిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, విజయరాణి, అరుణ, పద్మశ్రీ, శ్రీలత, బోజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో..

తలకొండపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందకు జాతీయ సైన్స్ దినోత్సవం ఎంతగానో ఉపయోగపడునని హెచ్‌ఎం శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి.రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరయ్య, సైన్స్ టీచర్ శారదాదేవి, కర్ణారెడ్డి, మల్లేష్, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- అన్మాస్‌పల్లి, ముద్విన్ గ్రామాల్లో పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి, ముద్విన్ గ్రామాల్లో మంగళవారం జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. అన్మాస్‌పల్లిలో సర్పంచ్ శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.13.89 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 37 పల్లె దవాఖానాలు మంజూరు కాగా.. మండలంలో చరికొండ, రావిచేడ్, చల్లంపల్లి, ముద్విన్ గ్రామాల్లో నాలుగు మంజూరయ్యాయని త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా 108 పాఠశాలల్లో రూ.69 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. నియోజకవర్గానికి 4 వేల డబుల్‌బెడ్ రూం ఇళ్లు, 1500 దళిత బంధు యూనిట్లు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. అన్మాస్‌పల్లి గ్రామానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.కోటి మంజూరయ్యాన్నారు. ఈ సందర్భంగా అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన పారిశ్రామికావేత్త విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ భవనానికి స్థలం కేటాయిస్తే గ్రామంలో రూ.కోటితో మోడల్ గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ముద్విన్ గ్రామంలో పర్యటించిన ఎమెల్యే.. గ్రామంలో నిర్మిస్తున్న పంచాయతీ భవనాన్ని, సీసీరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన 'నీరా' తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్య, సులోచన, శంకర్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, నిర్మలాదేవి, ఉపసర్పంచ్‌లు అనిల్, వినోద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, పారిశ్రామికవేత్త విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు సేవ్యానాయక్, రాజేందర్‌యాదవ్, మహేశ్‌యాదవ్, రమేశ్, శ్రీను, జాన్యా ఉన్నారు.